క్లుప్తంగా

ఆధ్యాత్మిక మార్గంతో జీవితానికి సార్థకత



మాట్లాడుతున్న దైవ సేవకులు సుధీర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆధ్యాత్మిక మార్గంలో నడవడం ద్వారా జీవితానికి సార్థకత లభించినట్లవుతుందని తిరుపతికి చెందిన క్రీస్తు సంఘ దైవజనులు కేకే సుధీర్, సుభాస్ చంద్రబోస్‌లు తెలిపారు. శనివారం కడప నగరం 48వ డివిజన్ కృపా కాలనీలో పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ఆధ్యాత్మిక సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం దైవ సేవకులు సుధీర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సేవకులు పి.రవితేజ, వినోద్ కుమార్, కిరణ్, థామస్, అశోక్, పి.దానియేలు పాల్గొన్నారు.

పారదర్శకంగా బదిలీలపై అభినందనలు

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో పారదర్శకంగా బదిలీల ప్రక్రియను నిర్వహించడం పట్ల ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆ మేరకు శనివారం స్థానిక ఆ కార్యాలయంలో ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన ఆ సంఘం నేతలు బి శ్రీనివాసులు, రవికుమార్, చంద్రమోహన్, మాధవ్, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ జీఈఎ ఆధ్వర్యంలో..

జూమ్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలను విజయవంతంగా నిర్వహించడం సంతోషంగా ఉందని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్యను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై నేరాలను అరికట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: మహిళలపై పెరుగుతున్న హింసాత్మక నేరాలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని డీసీసీ అధ్యక్షురాలు విజయ జ్యోతి పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లలపై అత్యాచారాలు పెరిగాయన్నారు. వీటిని అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమయిందన్నారు.

రామాస్ శ్రీకర ఆసుపత్రిలో అరుదైన చికిత్స



చికిత్స అనంతరం తొలగించిన ఇంజక్షన్ నీడిల్

కడప రూరల్: యువకుడు పొరపాటున ఇంజక్షన్ నీడిల్ ను మింగాడు. ఈ ఇంజక్షన్ నీడిల్ ను కడప నగరం నాగరాజు పేటలో గల రామాస్ శ్రీకర ఆసుపత్రి వైద్యులు రామాంజుల రెడ్డి అరుదైన చికిత్స ద్వారా ఇంజక్షన్ నీడిల్ ను విజయవంతంగా తొలగించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పెండ్లిమర్రి మండలం, కోరం పల్లె కు చెందిన 20 ఏళ్ల యువకుడు రూపేష్ ఇంజక్షన్ నీడిల్ ను తన నోటి పెదవుల మధ్య ఉంచుకొని ఉన్నాడు. పొరపాటున ఆ నీడిల్ ను మింగడంతో, అది గొంతు కింది భాగంలో ఇరుక్కుపోయింది. దీంతో అతను తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. తక్షణ వైద్యం కోసం బంధువులు రూపేష్ ను రామాస్ శ్రీకర ఆసుపత్రికి తీసుకువచ్చారు. అరగంట పాటు శ్రమించి బ్రాంకోస్కోపి ద్వారా విజయవంతంగా ఇంజక్షన్ నీడిల్ ను తొలగించినట్టు ఆయన తెలిపారు.

న్యాయం చేయండి

కడప రూరల్ : తాను కొనుగోలు చేసిన ఇంటిని అప్పగించకుండా తిరిగి స్వాధీనం చేసుకున్న వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కడప నగరం మృత్యుంజయకుంటకు చెందిన రామసుబ్బయ్య కోరారు. శనివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మృత్యుంజయకుంటలో ఓ మహిళ వద్ద రూ. 10 లక్షలకు ఒక ఇంటిని కొనుగోలు చేశానన్నారు. ఆ రూ. 10 లక్షల డబ్బును మూడు విడతలుగా చెల్లించానని తెలిపారు. ఈ తరుణంలో తాను అనారోగ్యానికి గురి కావడంతో ఇంటికి దూరంగా ఉండాల్సి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో తనకు ఇంటిని విక్రయించిన మహిళ దౌర్జన్యంగా వచ్చి తాళాలు పగులగొట్టి ఆ ఇంటిలో నివసిస్తోందని ఆరోపించారు. ఇదేమని ప్రశ్నిస్తే నేను నీకు ఇల్లు అమ్మలేదని బుకాయిస్తోందన్నారు. ఇంటి కొనుగోలుకు సంబంధించి పత్రాలు తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయమై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయోజనం లేదన్నారు. తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం



యోగాసనాలు సాధన చేస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది



యోగాసనాలు చేస్తున్న కేవీకే సమన్వయకర్త వీరయ్య, శాస్త్రవేత్తలు

కడప ఎడ్యుకేషన్: సంపూర్ణ ఆరోగ్యంతో పాటు పరిపూర్ణ జీవన విధానానికి యోగ అత్యంత ఆవశ్యకమని యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి పద్మ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం లోని వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం విభాగంలో శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని × యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య పుత్తా. పద్మ , ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్ మాట్లాడుతూ యోగ ఉన్నతమైన మార్గమని తెలిపారు. ప్రపంచ దేశాలన్నీ భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను గురించి గొప్పగా చెప్పుకొంటున్నాయన్నారు. వ్యాయామ విద్య క్రీడల శాస్త్ర శాఖ విభాగాధిపతి డాక్టర్ ఏ రామసుబ్బారెడ్డి , యోగ గురువు రామ మనోహర్, డాక్టర్ బసిరెడ్డి రాఘవేంద్ర యోగాసనాలు వేసి అందరితో చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

యోగాతో మానసికోల్లాసం

యోగాతో మానసికోల్లాసంతోపాటు ఆరోగ్య భాగ్యం కలుగుతుందని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ విశ్వనాథకుమార్ అన్నారు. శనివారం కడప నగర శివార్లలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా గురువు వెంకటశాస్త్రి యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

కడప అగ్రికల్చర్: నిత్యం యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్ర సమన్వయకర్త అంకయ్యకుమార్, కేవీకే శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మహేష్‌బాబు, సాయి మహేశ్వరి, మానస, సురేష్‌కుమార్‌రెడ్డి, గిరీష్‌కుమార్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

– యోగా మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతో అవసరం అని కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ అన్నారు. కడప ప్రధాన తపాలా కార్యాలయంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా గురువు సిద్దయ్య హాజరై తపాలా సిబ్బందితో వివిధ యోగాసనాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్‌శాఖ ఏఎస్‌పి విజయభాస్కర్‌రెడ్డి, విజయభాస్కర్, హెడ్‌పోస్టుమాస్టర్ సుబ్బరాయుడు, పబ్లిక్ ఇన్‌స్పెక్టర్ రఘుపతి, పిఎల్‌ఐ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మునాఫ్, మార్కెటింగ్ ఇంచార్జ్ వీరశేఖర్‌రెడ్డి, సలోమి, పుష్పలత పాల్గొన్నారు.

కందుల విద్యాసంస్థల్లో...

కడప నగర సమీపంలోని కందుల విద్యాసంస్థల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ టిఎన్ ప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ లక్షుమయ్య, వివిధ విభాగాధిపతులు, డీఎన్‌లు,విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో...

కడపలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. డీఐఈఓ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ చెప్పలి రాజారావు, అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల విద్యాపీఠ్‌లో...

కడప నగరంలోని గురుకుల విద్యాపీఠ్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాఠశాల చైర్మెన్ వెంకటేశ్వర్లు , ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

చైతన్య జూనియర్ కళాశాలలో..

కడపలోని ఎన్‌జీవోకాలనీలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో డీఎస్ నాగరాజు మాట్లాడుతూ యోగా మన రోజువారి జీవనశైలిలో భాగంగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివప్రసాద్, ఏవో మనోజ్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జునస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతిరోజు యోగాసనాలు చేయడం ద్వారా ఆరోగ్యాన్ని పదిలంగా చేసుకోవాలని యోగా గురువు ఓబయ్య పిలుపునిచ్చారు. ఆర్టీసీ రీజినల్ కార్యాలయ ప్రాంగణంలోగల గార్డెన్‌లో యోగాసనాలు అభ్యసించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి, డిప్యూటీ సీపీఎం గజలక్ష్మి, సీఓఎస్ హరి, కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు, పీఓ ధనలక్ష్మి, ఏటీఎం కమర్షియల్ జనార్ధన్‌తోపాటు కార్యాలయ సూపర్‌వైజర్లు, కడప డిపో ట్రాఫిక్ సూపర్‌వైజర్లు సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫాతిమాలో...

కడప నగర శివార్లలోని ఫాతిమా మెడికల్ కళాశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల కరస్పాండెంట్ జవ్వాద్ అహ్మద్ ఖురేషీ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ యోగా సాధన చేసి మనస్సు ప్రశాంతంగా ఉంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శైలారేఖ , కళాశాల ఈడీ సల్మాన్ ముర్తుజా, డైరెక్టర్ యు.జయరామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామమనోహర్‌రెడ్డి, ఇతర వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న తపాలాశాఖ ఉద్యోగులు



యోగాసనాలు వేస్తున్న వైవీయూ ప్రొఫెసర్లు

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు నిర్వాహకురాలు శివదర్శనానంద సరస్వతి మాతాజీ తెలిపారు. శనివారం స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో గాజులపల్లె పెద్దసుబ్బయ్య, పెద్ద సుబ్బమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ప్రతిభాపురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శివదర్శనానంద సరస్వతి మాతాజీ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. సేవా సంస్థ అధ్యక్షుడు గాజులపల్లె రామచంద్రుడు మాట్లాడుతూ పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు 15 ఏళ్లుగా ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత తెలుగు పండితురాలు ఎస్.నాగరత్నం, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఈశ్వర్‌రెడ్డిలను సన్మానించారు. అలాగే ఉచితంగా ఆక్యుపంక్చర్ వైద్యం చేస్తున్న వెంకటరాముడు, ఉచిత యోగా విద్య నేర్పిస్తున్న ఉండేల మునిశేఖర్‌రెడ్డిలను సత్కరించారు. మండలంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన 43 మంది విద్యార్థులకు రూ.63వేలు ప్రతిభా పురస్కారాలతోపాటు ప్రశంసాపత్రాలు అందించారు.

బదిలీలలో ఎంటీఎస్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

కడప ఎడ్యుకేషన్: డీఈఓ కార్యాలయంలో తలపెట్టిన కౌన్సెలింగ్‌లో ఎంటీఎస్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని యూటీఎఫ్ జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ విషయమై శనివారం కడపలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు మాట్లాడుతూ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు నిర్వహించ తలపెట్టిన కౌన్సెలింగ్‌లో ప్రదర్శించిన ఖాళీలు అసంబద్ధంగా, నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. నిబంధనల మేరకు ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో బదిలీ పొంది, రిలీవర్ లేక రిలీవ్ కాకుండా నిలిచిపోయిన వారి స్థానాలను మాత్రమే చూపించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా ఖాళీలను చూపెట్టారన్నారు. దీనివల్ల బదిలీ పొంది రిలీవర్ లేక నూతన పాఠశాలలో చేరలేక అదే స్థానంలో కొనసాగాల్సి వస్తున్నదన్నారు. దీంతోపాటు తక్కువ వేతనంతో పనిచేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు సుదూర ప్రాంతానికి వెళ్లి పని చేయాల్సి వస్తున్నదన్నారు. ఈ విధానం ఎంటీఎస్ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టాన్ని కలిగించడంతో పాటు, సాధారణ బదిలీలలో బదిలీలు పొందిన ఉపాధ్యాయులు సైతం రిలీవర్ లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు ఈ విషయంపై తక్షణమే స్పందించి ఇప్పుడు ప్రదర్శించిన ఖాళీలను మార్పు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎస్ ఉపాధ్యాయులు రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఆర్టీసీ అధికారులూ సమస్య పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి నిత్యం ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు సీజనల్ బస్సు పాసుల కోసం వచ్చి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్టాండు ఆవరణలో బస్సు పాసులు జారీ చేసే కేంద్రం ఏర్పాటు చేశారు. చిన్నపాటి గదిని ఇందుకు వినియోగిస్తున్నారు. అయితే గది పైభాగాన మూత్రశాలల నీరువెళ్లే పైపులు లీకేజీ కారణంగా ప్రతినిత్యం బస్సు పాసులు జారీ చేసే గదిలో ఆ నీరు పడుతూ దుర్వాసన వెదజల్లుతోంది. ఈ కారణంగా అక్కడ పనిచేసే వారితోపాటు బస్సు పాసుల కోసం వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయంగా ఆర్టీసీ అధికారులు సమస్యను పరిష్కరించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



పాసులు జారీ చేసే గదిలో పైపుల నుంచి పడిన మూత్రశాలల లీకేజీ నీరు

కమనీయం.. శ్రీనివాసుడి కల్యాణం

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని ఫైర్ ఆఫీసు వెనుకభాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ఆవరణలో నిర్వహించిన పద్మావతి, గోదాదేవి వేంకటేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా సాగింది. ఉదయం 9–30 గంటలకు ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి కల్యాణ వేదికపైకి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. స్వామివార్ల కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం అనంతరం సాయంత్రం స్వామివారిని గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.



శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నంబర్ 36ను అమలు చేసి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలను రూ.21,000 – 24,500 ఇవ్వాలని అన్నారు. రిస్క్ అలవెన్స్, కరువు భత్యం ఇవ్వడం లేదన్నారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను వర్తింపజేస్తూ ప్రభుత్వం వెంటనే జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళ్లడానికి ఇంజనీరింగ్ కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీటెక్ శివన్న, గంగాధర్, వెంకటేశు, గురప్ప, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ కార్మికులు

24న ద్విచక్రవాహనాల వేలం పాట

బద్వేలు అర్బన్ : బద్వేలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన మూడు ద్విచక్రవాహనాలకు ఈ నెల 24న వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ బి.సీతారామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దవటం రోడ్డులోని మార్కెట్ యార్డు కాంపౌండ్‌లో గల ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఉదయం 11.30 గంటలకు నిర్వహించే ఈ వేలం పాటలో పాల్గొనదలచిన వారు నిర్దేశిత రుసుమును చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఎక్సైజ్ కార్యాలయంను సంప్రదించాలని తెలిపారు.

నాగరితకు చిహ్నాలు గ్రంథాలయాలు

వీరపునాయునిపల్లె : నాగరితకు గ్రంథాలయాలు చిహ్నాలు అని యోగివేమన విశ్వవిద్యాలయ ఆచార్యులు, అరసం కడప జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఈశ్వర్‌రెడ్డిలు తెలిపారు. శనివారం వీరపునాయుని మండలంలోని ఉరుటూరు గ్రామంలో వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ రజనీకాంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతను విజ్ఞానవంతులను చేయాలన్న సంకల్పంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, యోగివేమన విశ్వవిద్యాలయ వృక్ష శాస్త్ర అధ్యాపకులు రాజగోపాల్‌రెడ్డి, ఉరుటూరు గ్రామాభివృద్ధి సభ్యులు తిరుమల్‌రెడ్డి, మురలీధర్ రెడ్డి మరియు విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బలిజ అన్నదాన సత్రం నూతన కమిటీ ఎంపిక

బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారిమఠంలో ఉన్న కాపు బలిజ అన్నదాన సత్రం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా బద్వేల్‌కు చెందిన ధరిశెట్టి శ్రీనివాసుల రాయల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు మైదుకూరుకు చెందిన నారాయణరాయల్, ప్రధాన కార్యదర్శి శేగినేని పోతులూరయ్య, గ్రేటర్ రాయలసీమ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ పసులేటి శంకర్, రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు నారాయణస్వామిరాయల్, గండిక్షేత్రం చైర్మన్ కృష్ణతేజ, బద్వేల్‌టౌన్ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, పోరుమామిళ్ల సర్పంచ్ యపనమల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలి

మైదుకూరు : కౌలు రైతులు, డీకేటీ, చుక్కల భూములు కలిగిన రైతులకు కూడా అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయం అందించాలని సీపీఐ అనుబంధ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మైదుకూరులో విలేకరులతో మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ లబ్దిదారుల జాబితా నుంచి రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులు, డీకేటీ, చుక్కల భూములు కలిగిన రైతులను తొలగించినందుకు నిరసనగా సోమవారం కడప కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భూమిలేని నిరుపేద వ్యవసాయదారులైన దళితులు, బడు, బలహీన వర్గాల వారికి, అగ్రవర్ణ పేదలకు ప్రభుత్వం డీకేటీ పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. వారిని అన్నదాత సుఖీభవ పథకం నుండి తొలగించడం అంటే అంతకంటే అన్యాయం మరొకటి లేదన్నారు. ధర్నా కార్యక్రమంలో డీకేటీ, చుక్కల భూములు, కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు గోశెట్టి రామ్మూర్తి, ఎన్.సుబ్బారెడ్డి, నాయకులు గుజ్జుల లక్ష్మయ్య, కొట్టే రామమోహన్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

జమ్మలమడుగు రూరల్ : తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యానేరమని పట్టణ ఎస్ఐ హైమావతి తెలిపారు. శనివారం స్థానిక సాయిపరమేశ్వర జూనియరు కళాశాలలో విద్యార్థినులకు శక్తి యాప్‌పై ఆమె అవగాహన సదస్సును నిర్వహించి మాట్లాడారు. సమాజంలో ఎక్కువగా సైబర్ క్రైమ్ నేరాలు జరుగుతున్నాయన్నారు. వాటి పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమైన సమస్యలు ఉంటే వెంటనే శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

కౌన్సెలింగ్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి

జమ్మలమడుగు రూరల్ : ఈ ఏడాది పాలీసెట్‌లో నిర్వహించిన ఎంపిక ప్రక్రియకు అర్హత సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రవికుమార్ తెలిపారు. శనివారం మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ ప్రక్రియను ఆయన అధ్యాపకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జమ్మలమడుగు పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సారి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించారు. కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 28వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజర్ కావాలని ఆయన సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మట్కా బీటర్లు అరెస్టు

వేంపల్లె : మండలంలోని నాగూరు గ్రామంలో మట్కా ఆడుతున్న 5 మంది మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు. మట్కా బీటర్ల వద్ద నుంచి రూ.8 వేల నగదును స్వాధీనం చేసుకుని మట్కా స్లిప్పులను కూడా తీసుకున్నట్లు తెలిపారు. అందిన సమాచారం మేరకు మట్కా బీటర్లపై దాడులు చేయడంతో మట్కా రాస్తున్న నాగూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్, నాగయ్య, కొండా దుగ్గిరెడ్డి, కొమెర వెంకటరమణ వేంపల్లెలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన వల్లెపు వెంకటేష్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జమ్మలమడుగు : గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. శనివారం పి.బొమ్మేపల్లిలో సైబర్ నేరాలు, సోషల్ మీడియా ప్రభావాలపై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆయన అవగాహన సదస్సును నిర్వహించి మాట్లాడారు. సెల్ ఫోన్ల ద్వారా సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. వాట్సాప్‌లలో వచ్చే మేసేజ్‌లను ఏదీ పడితే అది నొక్కడం ద్వారా మీకు తెలియకుండానే మోసపోయే ప్రమాదం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామాలు వదిలిపోయేటప్పుడు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

వైభవంగా తిరునాల



పెండ్లిమర్రి : మండలంలోని కారపురెడ్డిపల్లెలో వెలసిన శ్రీ కొత్తగంగమ్మ తిరునాల ఉత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, ఆకు పూజ, పంచామృతాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అవరణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన ఎద్దులకు ఆలయ కార్యనిర్వాహకులు బహుమతులు అందజేశారు.